క్లుప్తంగా

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బాలలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సుగుణ

సత్యవేడు : ప్రతి విద్యార్థి బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గృహహింస చట్టం ఇన్‌చార్జి బి.సుగుణ పేర్కొన్నారు. గురువారం గురుకుల బాలుర పాఠశాలలో మిషన్ వాత్సల్య కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థుల బాధ్యతలు, నిర్వహణ, బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిగమించవచ్చని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అన్నారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్‌హెల్ప్‌లైన్ సూపర్ వైజర్ అరుణ, మహిళా పోలీసు ప్రత్యూష, పాఠశాల కమిటీ చైర్మన్ సురేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీ డైరీ విక్రయాలు ప్రారంభం

నారాయణవనం : స్థానిక టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 2025 సంవత్సరం డైరీ లు, క్యాలెండర్ల విక్రయ స్టాల్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు నాగరాజు తెలిపారు. గురువారం నుంచి విక్రయిస్తున్నామని రూ.150కి పెద్ద డైరీ, రూ.130కి 12 పేజీల క్యాలెండర్, రూ.20కి వేంకటేశ్వరస్వా మి క్యాలెండర్‌లు విక్రయిస్తున్నట్లు తెలిపారు. బల్క్‌గా డైరీలు, క్యాలెండర్లకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని నాగరాజు కోరారు.

ఇళ్లకు దారి కల్పించండి ఎస్టీల వినతి

నాగలాపురం : మండలంలోని సురుటుపల్లి పంచాయతీకి చెందిన కస్తూరినాయుడు కండ్రిగ ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్టీలు తమ ఇళ్లకు దారి కల్పించాలంటూ గురువారం స్థానిక తహసీల్దారు హనుమాన్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎస్టీ కాలనీవాసులు మాట్లాడుతూ.. తాము నివాసం ఉంటున్న ఇళ్ల ఎదుట ఇదే పంచాయతీలోని అధికార పార్టీకి చెందిన ఓ మహిళా అధ్యక్షురాలికి కొంత స్థలం ఉందని ఆ స్థలంలో రక్షణ కంచె పనులు చేపట్టారన్నారు. ఆయితే తమ ఇళ్లకు దారిలేకుండా పూర్తిగా కంచె వేయడంతో రాకపోకలు ఇబ్బందికరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి తమ ఇళ్లకు దారి సౌకర్యం కల్పించాలని తహసీల్దారును కోరారు.


ఎమ్మార్పీకే మందులు విక్రయించాలి

నారాయణవనం : మండలంలో రసాయన ఎరువులను విక్రయిస్తున్న దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి శోభారాణి తనిఖీ చేశారు. మండలంలో నాలుగు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎంఆర్‌పీకే ఎరువులను విక్రయించాలని సూచించారు. అనుమతి లేని పురుగుమందులు, ఎరువులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలీసులకు సహకరించండి

రేణిగుంట : మండలంలో నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని సీఐ శరత్‌చంద్ర పేర్కొన్నారు. మండలంలోని మామండూరులో గురువారం శాంతి భద్రతలలో భాగంగా సైబర్ క్రైమ్ అవేర్నెస్, డ్రగ్స్, ఉమెన్ అండ్ చిల్డ్రన్ నేరాలు, సోషల్ మీడియా, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. టోల్ ఫ్రీ నంబర్ 1930 ద్వారా నేరాలను అరికట్టే సూచనలను తెలియజేశారు. ముఖ్యంగా పిల్లలు, మహిళలపై జరిగే నేరాలను అరికట్టాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


రామలింగేశ్వరస్వామి ఆలయం ముందు ధ్వజస్తంభం ఏర్పాటు చేసిన రుత్వికులు

సత్యవేడు : మండలంలోని మదనంబేడు పంచాయతీలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వైభవంగా జరిగింది. గురువారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య ధ్వజ స్తంభాన్ని శాస్త్రోక్తంగా రుత్వికులు ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయంలో కలశ, హోమ పూజలు నిర్వహించారు. స్వామి వారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం భక్తుల కు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు రవికుమార్ దేవర్, గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

సాగులో ఉన్న వరిపంట



వేరుశెనగకు దుక్కిదున్ని సిద్ధం చేసిన పొలం



పరిహారం పరిహాసం

- వైఎస్సార్ ఉచిత బీమాకు మంగళం
- రైతన్నకు ఇన్సూరెన్స్ అదనపు భారం
- రుణాల రెన్యూవల్‌కు లింకుపెట్టిన బ్యాంకర్లు
- డిసెంబర్ 15వ తేదీ తుది గడువు
- ఆందోళనలో అన్నదాతలు

అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం నుంచి ఏటా రూ.20 వేలు రైతు ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వాగ్దానాన్ని తుంగలో తొక్కింది. రైతులకు రబీ సీజన్ నుంచి కూటమి సర్కారు భారీ షాక్ ఇచ్చింది. రైతులపై అదనంగా ఇన్సూరెన్స్ ప్రీమియం భారం మోపింది. వ్యవసాయంతో పాటు ఇతర పంటలు పండిస్తున్న రైతులకు గత ప్రభుత్వం ఎంతో అండగా నిలిచింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా ప్రీమియం మొత్తం ప్రభుత్వమే చెల్లించేది. కూటమి ప్రభుత్వం ఆ పథకానికి తూట్లు పొడిచింది. ఇకపై ప్రకృతి వైపరీత్యాల సమయంలో బీమా అందాలంటే గుర్తించిన పంటలకు బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతన్నలు కూటమి సర్కారుపై మండిపడుతున్నారు.

నారాయణవనం : ప్రకృతి విపత్తుల నుంచి ఏటా రైతులు నష్టపోయేవారు. బీమా చెల్లించుకోకపోవడంతో తుపాన్ సమయంలో వచ్చిన నష్ట పరిహారం దక్కేదికాదు. వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నదాతల కోసం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ–క్రాప్ విధానంతో ప్రతి రైతు వివరాలు నమోదు చేసి వారికి ఉచితంగా పంటల బీమా వర్తింపజేశారు. వరికి రూ.600, వేరుశెనగకు రూ.400, ఉద్యానవన పంటలైన మామిడికి సుమారు నాలుగు వేల రూపాయల బీమా ప్రీమియం చెల్లించాలి. ఆ మొత్తం గత ప్రభుత్వమే చెల్లించేది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బీమా విషయంలో ధీమాగా ఉండేవారు. దీనికి తోడు పెట్టుబడి సాయం కింద ఏటా రైతుల ఖాతాలో రూ.13,500 జమ అయ్యేది.దీంతో రైతుకు ఆ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది.

రుణాలు రెన్యూవల్ చేస్తేనే ..

రబీ సీజన్ నుంచి బీమా ప్రీమియం భారాన్ని కూటమి ప్రభుత్వం మరోమారు రైతులపై మోపింది. ప్రీమియం చెల్లించేందుకు డిసెంబర్ 15వ తేదీ తుది గడువు విధించింది. ఎకరం వరి పంటకు రూ.430, వేరుశెనగకు రూ.450 రైతులే చెల్లించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. రుణాలు రెన్యూవల్ చేసుకుంటే తప్ప ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు చెబుతుండటంతో రుణాల చెల్లింపు రైతులకు భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేశాం.. ఇప్పుడు రుణాలను ఎలా రెన్యూవల్ చేయగలమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగు ఇలా..

నారాయణవనం మండలంలో రబీలో సుమారుగా 520 హెక్టార్లలో వేరుశెనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. బీమా ప్రీమియంగా ఎకరం పంటకు రూ.450 చెల్లించాల్సి ఉంది. వరిని సుమారుగా 175 హెక్టార్లలో ఇప్పటికే నాట్లు వేశారు. వరికి ఎకరానికి రూ.630 చెల్లించాల్సి ఉంది. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకులో ప్రీమియం చెల్లించాల్సి ఉండగా, రుణాలు తీసుకోని రైతులు సీఎస్‌సీ కేంద్రంలో చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. మరోవైపు క్రాప్ లోను చెల్లిస్తేనే ప్రీమియం చెల్లింపు అనుమతి ఇస్తామని బ్యాంకర్లు అంటుండడంతో రైతులకు ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

నిర్ణయం వెనక్కు తీసుకోవాలి

రైతులే స్వయంగా ప్రీమియం చెల్లించుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో రైతులకు ఈ నిర్ణయం భారం కానుంది. ఇటువంటి నిర్ణయాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి. గత ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా బీమా నమోదు జరిగేది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని రద్దు చేసే నిర్ణయాన్ని తక్షణమే కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలి.

– గోపి, రైతు, తిరువట్యం

అప్పు చేసి పంటల సాగు

గత ఐదేళ్ల సాగుకు ముందే పెట్టుబడి నిధి అందిస్తూ, బీమా ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించింది. పీటమెక్కిన కూటమి ప్రభుత్వం నుంచి సాయం అందకపోగా, బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని చెబుతోంది. అప్పులు చేసి పంట సాగు చేపట్టాం. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మారింది.

– గురుస్వామి, రైతు, ఏఆర్ కండ్రిగ

ప్రజాసమస్యలపై పోరాటం చేయాలి


తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్‌కు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం తాడేపల్లిలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తితో కలిసి మాజీ ముఖ్యమంత్రిని నూకతోటి రాజేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ కేడర్, దశల వారీగా అందరిని కలిసేందుకు వీలు కల్పిస్తానని చెప్పినట్లు ఆయన వివరించారు. పార్టీ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా నిలవాలని సూచించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి బీమా పరిహారం

బుచ్చినాయుడుకండ్రిగ : మండల కేంద్రంలోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజరు వెంకటరమణ గురువారం బాధిత కుటుంబ సభ్యురాలు యనమల ప్రియాకు ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకంలో 18 సంవత్సరాల నుంచి 50 ఏళ్ల వయస్సు కలిగినవారు ఏటా బ్యాంకులో రూ.434 చెల్లిస్తే వారు ప్రమాదవశాత్తు, సాధారణంగా మరణించినా రూ. 2 లక్షల నగదు కుటుంబానికి అందజేస్తారని తెలిపారు. గత సంవత్సరం చిట్టివారికండ్రిగ గ్రామానికి చెందిన యనమల వెంకటరమణ ప్రమాదంలో చనిపోగా ఆయన భార్య యనమల ప్రియాకు ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకంలో రూ. 2 లక్షల చెక్కును అందజేయడం జరిగిందన్నారు. బ్యాంకులోని ఖాతాదారులు ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేసుకుంటే కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి : మండలంలోని తొండమనాడులో ఉన్న రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధుల సంక్షేమ కేంద్రానికి పట్టణానికి చెందిన డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాల విద్యార్థులు గురువారం నిత్యావసర సరుకులను వితరణ చేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్స్ డాక్టర్ కిషోర్, వాసంతి కిషోర్ మాట్లాడుతూ.. హ్యాండ్స్ టు హ్యాపీనెస్ కార్యక్రమంలో భాగంగా అందించినట్లు తెలిపారు. విద్యార్థులకు సేవా గుణం అలవరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, మేనేజరు దైవజ్ఞాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్తీక వన భోజనాలకు సుమన్‌కు ఆహ్వానం


సినీనటుడు సుమన్‌ను సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

శ్రీకాళహస్తి : గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక వన భోజనాలకు ప్రముఖ సినీ నటుడు సుమన్‌ను ఆ సంఘం నాయకులు గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి గౌడ సంఘం చైర్మన్ పర్వతాల చంద్రశేఖర్‌గౌడ్, గౌరవాధ్యక్షుడు అత్తిరాల శ్రీరాములుగౌడ్, తిరుపతి జిల్లా లీగల్ అడ్వైజర్ ఉదయగిరి మోహన్ గౌడ్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

ఇద్దరు ఆకతాయిల బైండోవర్

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కంచనపుత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఆకతాయిలను గురువారం తహసీల్దార్ సుబ్రహ్మణ్యం ఎదుట పోలీసులు బైండోవరు చేశారు. ఆకతాయిలు మద్యం తాగి బుచ్చినాయుడుకండ్రిగలో గొడవ పడుతుండటంతో అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ ఎదుట బైండోవరు చేసినట్లు ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు.

ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ సేవలు చిరస్మరణీయం


కర్మకాండలకు హాజరైన మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఏపీ సీడ్స్ మాజీ డైరెక్టర్ భక్తవత్సలరెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం తొండమానుపురంలో భక్తవత్సలరెడ్డి కర్మ క్రియలు జరిగాయి. ఆ కార్యక్రమానిక మాజీ ఎమ్మెల్యే హాజరై ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాల సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

జోరుగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

నారాయణవనం: మండలంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు జోరందుకుంది. ప్రీపెయిడ్ చార్జీలతో విద్యుత్ వినియోగానికి స్మార్ట్ మీటర్లను ట్రాన్స్‌కో సిబ్బంది ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతగా వ్యాణిజ్య సర్వీసులతో పాటు వీధి దీపాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ జయప్రకాష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంట్రాక్టర్లు మండలంలోని గ్రామాలలో వీధి దీపాలకు స్మార్ట్ మీటర్లను అమర్చుతున్నట్లు తెలిపారు. మలి విడతలో గృహాల సర్వీసులకు స్మార్ట్ మీటర్లను అమర్చుతారని చెప్పారు. ప్రస్తుతం మండలంలో కొత్త సర్వీసులు తీసుకుంటున్న వినియోగదారులకు స్మార్ట్ మీటర్లనే ఇవ్వనున్నట్లు వెల్లడించారు. స్మార్ట్ మీటర్లకు ప్రత్యేక మొబైల్ యాప్‌లో ముందస్తుగా నగదును రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అప్పటివరకు స్మార్ట్ మీటర్లను పాత విధానంలో రీడింగ్ రికార్డు చేసి బిల్లులు అందజేస్తామని ఆయన వెల్లడించారు.

ఆక్రమణలు అడ్డుకోండి


ఇనుప స్తంభాన్ని చూపుతున్న ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్తుల ఆక్రమణలను అడ్డుకోవాలని మాజీ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులకు సూచించారు. గురువారం ఆయన రాజగోపురం ముందు గాంధీ విగ్రహం పక్కనే ఆలయ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు వేసిన కాంక్రీట్‌తో నాటిన 10 ఇనుప పోల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ప్రయివేటు వ్యక్తులు ఆక్రమిస్తున్నా అధికారులు ఆపకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా గతంలో ప్రజలు స్వచ్ఛందంగా తమ స్థలాలకు ఇచ్చారని గుర్తుచేశారు. అలాంటి స్థలంలో ఇంజినీరింగ్ సిబ్బందికి తెలియకుండా ఎవరో ప్రైవేటు వ్యక్తులు కాంక్రీట్ సిస్టంతో పనులు చేస్తున్నా ఆలయ ఉద్యోగులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమయన్నారు. ఈవో వెంటనే స్పందించాలని కోరారు.

కేంద్ర సహాయ మంత్రికి స్వాగతం


కేంద్ర సహాయ మంత్రి రక్షా నిఖిల్ ఖడ్సేకు స్వాగతం పలుకుతున్న ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు

రేణిగుంట : తిరుమల శ్రీవారి దర్శనార్థం గురువారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ సహాయ మంత్రి రక్షానిఖిల్‌ఖడ్సేకు సాదర స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్ట్ అధికారులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు దామోదరం, పాకనాటి హరికృష్ణ ఉన్నారు. అనంతరం ఆమె రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లారు.

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ

రేణిగుంట : బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని ప్రగతి సంస్థ డైరెక్టర్ రమణ పేర్కొన్నారు. జాతీయ బాలల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఆర్.మల్లవరం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులను కాపాడేందుకు సమాజంలో పౌరులందరూ అవగాహనతో మెలగాలన్నారు. 8, 9, 10 తరగతి పిల్లలకు వ్యాసరచన పోటీలు నిర్వహించి తరగతికి ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేసి వారికి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి సంస్థ మండల కో ఆర్డినేటర్ జయలక్ష్మి, హైస్కూల్ హెచ్‌ఎం వెంకటరమణ, సుజాత, ప్రగతి సంస్థ సిబ్బంది సురేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన


కుంకుమార్చన చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. మొదట స్వామి అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించి గణపతి పూజ నిర్వహించారు. అనంతరం వేద పండితులు, రుత్వికులు ఆలయ అలంకార మండపలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు లక్ష బిల్వార్చన, కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు, పలువురు ప్రముఖులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మమ్మకు మాజీ ఎమ్మెల్యే నివాళి


ఆదిలక్ష్మమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం పాయ్య గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడు సతీమణి మాజీ సర్పంచి ఆదిలక్ష్మమ్మ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం నివాళి అర్పించారు. కర్మ క్రియల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పాయ్య గ్రామానికి చేరుకొని వాసుదేవనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ, ఏపీ సీడ్స్ మాజీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి, చంద్రయ్యనాయుడు, సురేష్, వసంత్, చెంగల్‌రాయలు, గోపి, శేఖర్ పాల్గొన్నారు.

26న మహాధర్నాను విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద ఈ నెల 26న జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి చెన్నం పెంచులయ్య సంయుక్తంగా పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా రైతుల పంట సాగుకు అవసరమైన రూ.20 వేలు సాయాన్ని అందజేయాలన్నారు. పంటలకు బీమా సౌకర్యం, గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. అలాగే కార్మిక వర్గాలు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనమాల గురవయ్య, తులసీరాజన్, వైఎస్ మణి, కత్తి ధర్మయ్య, కత్తి రవి, శివకుమార్, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి

సత్యవేడు : ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా మహిళలు మమోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి కోరారు. సత్యవేడు–2, పుదుకుప్పంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు సంచార వాహనంలో నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యదర్శి చంద్రశేఖర్, రమేష్, ఎంపీడీఓ చంద్రశేఖర్, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్, ఎంపీఓ రవి, ఎంపీటీసీ శరవనన్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, కేన్సర్ పరీక్షా డాక్టర్లు పద్మావతి, హరిత పాల్గొన్నారు.

పురుగుమందుల దుకాణాల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో పురుగు మందుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారిణి భారతి తనిఖీ చేశారు. పురుగు మందులకు సంబంధించిన రికార్డులు, ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పురుగు మందుల దుకాణాల్లో నాణ్యమైన మందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని కోరారు. కాలం చెల్లిన మందులను అమ్మకూడదన్నారు. కల్తీ మందులను విక్రయిస్తే లైసెన్స్‌లను రద్దు చేసి, కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

బీసీ హాస్టల్‌లో తాగునీటికి మోక్షం


ఎంపీ నిధులతో ఏర్పాటైన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్

రేణిగుంట : పట్టణంలో బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల తాగునీటి సమస్యకు ఎంపీ గురుమూర్తి చొరవతో శాశ్వత పరిష్కారం లభించింది. హాస్టల్‌లో విద్యార్థులకు తాగునీటి సమస్య ఉన్నట్లు విద్యార్థులు ఇటీవల ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన రూ.2.5 లక్షల ఎంపీ నిధులను కేటాయించి నూతనంగా ఆర్‌ఓ ప్లాంటును మంజూరు చేశారు. విద్యార్థులు తాగునీరు కలుషితమై అనారోగ్యానికి గురికాకుండా శుద్ధమైన తాగు నీటిని అందించేలా వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. ఎంపీ గురుమూర్తి ప్రత్యేక చొరవ చూపడంపై విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, పుర ప్రముఖులు ధన్యవాదాలు తెలిపారు.